కొమురం భీం జయంతి

దమ్మపేట: మండల కేంద్రంలో ఆదివాసీ నాయకుడు కొమురం భీం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం దమ్మపేట గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల అభ్యున్నతి కోసం కొమురం భీం చేసిన పోరాటాలు మరవలేనివని పేర్కొన్నారు. వాడే వీరాస్వామి, అరెం ప్రసాద్, వాసం వెంకటేశ్వరరావు, తంబళ్ల రవి, రామ్మూర్తి, బొజ్జి పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఆదివాసీ పోరాటయోధుడు కొమరంబీం జయంతి వేడుకలు దుమ్ముగూడెం మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. మండలంలోని లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి తదితరులు కొమరంబీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగారంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూపా సీతయ్య నాయకులు నూపా చిట్టిబాబు, వర్సా సర్వేశ్వరావులు భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా సద్దుల బతుకమ్మ

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో.., రామరామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. అంటూ తొమ్మిది రోజులపాటు సాగిన బతుకమ్మ సంబురాలు ఆదివారం సద్దుల బతుకమ్మతో అంబురాన్నంటాయి. యువతులు, తల్లిగారింటికి చేరిన ఆడపడుచులు తీరొక్కపూలతో అందమైన బతుకమ్మలను పేర్చి గద్దెల వద్దకు చేరుకున్నారు. సంప్రదాయ కట్టు, బొట్టుతో ఆటపాటలతో సందడి చేశారు. అర్ధరాత్రి వరకు సాగిన వేడుకల అనంతరం నీటి వనరుల వద్దకు బతుకమ్మలను తోడుకొని వెళ్లారు. పోయిరా బతుకమ్మ, మళ్లి రా బతుకమ్మ అంటూ నిమజ్జనంతో వీడ్కోలు పలికారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చర్లరూరల్: కుదునూరులో బతుకమ్మను పేరుస్తున్న మహిళలు


మణుగూరుటౌన్: సుందరయ్యనగర్‌లో ఒక చోట చేర్చిన బతుకమ్మలు


అశ్వాపురం: మొండికుంటలో బతుకమ్మలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, గ్రామ పెద్దలు


బతుకమ్మతో చిన్నారి..


కరకగూడెం: బతుకమ్మలతో వస్తున్న మహిళలు, యువతులు


మణుగూరుటౌన్: సింగరేణి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు


గుండాల: ఆళ్లపల్లి మండలం మర్కోడులో బతుకమ్మ వేడుకలు


చర్ల: బతుకమ్మలను సాగనంపుతున్న మహిళలు

స్ట్రాంగ్ రూంకి చేరిన ఈవీఎంలు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మణుగూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు చేరాయి. రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాఘవ రెడ్డి పోలీసు బందోబస్తు నడుమ భద్రపరచగా, అన్ని పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. పినపాక నియోజకవర్గానికి 301 కంట్రోల్ యూనిట్‌లు, 301 బ్యాలెట్ యూనిట్‌లు, 337 వీవీ ప్యాట్‌లు కేటాయించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తెలిపారు. సీసీ కెమెరాల నడుమ, పోలీసు బందోబస్తు, ఎటువంటి వెలుతురు లేకుండా స్ట్రాంగ్ రూంలో ఏర్పాటు చేశామన్నారు. నవంబర్ 30న ఎన్నికలకు ఒక్కరోజు ముందు స్ట్రాంగ్ రూంను తెరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు పోశం నర్సింహారావు, పీరినాకి నవీన్, లింగంపల్లి రమేశ్, సీపీఐ నాయకులు ఆర్ ఐలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంకు తాళం వేస్తున్న రిటర్నింగ్ అధికారి

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్ట్, కలివేరు క్రాస్‌రోడ్ ఆర్ కొత్తగూడెం సెంటర్లలో మోహరించిన పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి విడిచిపెట్టారు.

సీఐ రాజగోపాల్ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలు నిర్వహించగా తనిఖీలలో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

బూర్గంపాడు: రానున్న అసెంబ్లీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. తాళ్లగొమ్మూరుకు చెందిన 70 కుటుంబాలు ఆదివారం ప్రభుత్వవిప్ రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.

వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, కొనకంచి శ్రీనివాస్, బాలి శ్రీహరి, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, చలకోటి పూర్ణ, బెజ్జంకి కనకాచారి, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ రేగా

న్యాయం చేయండి

మణుగూరుటౌన్: సింగరేణి ఓసీతో భూములు, ఇళ్లు పోగొట్టుకున్న తమ కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యాజమాన్యం ఇంతవరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని మణుగూరు ఓసీ దళిత భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జెడ్పీ స్కూల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సింగరేణి భూ నిర్వాసిత గ్రామాలైన జయశంకర్ నగర్, కొత్తమల్లేపల్లి, అయోధ్యనగర్, కేసీఆర్ నగర్, కట్టుమల్లారం గ్రామాల్లో సీఎస్ఆర్ ఫండ్లు నిధులు వినియోగం లేదన్నారు. కలుషిత నీరు తాగి అనారోగ్య పాలవుతున్నామని, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడం లేదన్నారు. శాశ్వత ఉద్యోగాలు కల్పనతో పాటు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని, ల్యాండ్ లూసర్ సర్టిఫికెట్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసిత కమిటీ సభ్యులు శివ ప్రసాద్, నగేశ్, రాసమల్ల సాగర్, పిల్లి సద్దిప్, దేగల కృష్ణ, గంధం రామారావ్, చెట్టి ప్రసాద్, మహేష్, ఏశావు పాల్గొన్నారు.

పోటీలో బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి

దమ్మపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిని పోటీలోకి దింపే యోచనలో ఉన్నట్లు జనసేన మండల అధ్యక్షుడు రెహమాన్ తెలిపారు. జనసేన పార్టీ ముఖ్య నాయకుల మండల సమావేశాన్ని ఆదివారం దమ్మపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. తమ అభ్యర్థిని గెలిపించుకునే దిశగా ప్రతీ కార్యకర్తా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రేగళ్ళ సతీష్, నాగబాబు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం(బెస్తగూడెం), ఎస్సీ కాలనీకి చెందిన 70 కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరాయి. వైస్ ఎంపీపీ కేవిరావు, గుండగాని నాగేశ్వరరావు, ఉపసర్పంచులు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, వీరంకి వెంకట్రావ్, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, ఉడుముల తిరపతి రెడి తదితరులు ఉన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని కల్యాణపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలు కుటుంబాల వారు ఆదివారం పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా పాయం, బ్రహ్మయ్య పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖధీర్, ఎంపీటీసీ కమటం నరేష్, బేతం రామకృష్ణ, సర్పంచ్‌లు బట్టా సత్యనారాయణ, కాకా అశోక్, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, వేములపల్లి రమేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

అశ్వాపురం: మండల కేంద్రంలోని అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో ఉన్న పూర్వ విద్యార్థులందరూ ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుఅన్నరు. ఒకరితో ఒకరు అప్యాయంగా మాట్లాడుకుని సరదాగా గడిపారు. విద్యాభ్యాసం నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.